
సాక్షి గుంటూరు

శనివారం । 27 । మే । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 520.60 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.



బెజవాడలో భారీ వర్షం

బెజవాడలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ మధ్యాహ్నానికి ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా వాన పడింది.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్టధర రూ.వెయ్యి, . గరిష్టధర రూ.రెండు వేలు, మోడల్ ధర రూ.1,600 వరకు పలికింది.

న్యూస్‌రీల్



జయ'జన'ధ్వానాలు



పసిబిడ్డతో పట్టా కోసం..

పట్టాల సవ్వడితో చెంతనే ఉన్న కృష్ణమ్మ పులకించిందో ఏమో.. ప్రజా రాజధాని జన ప్రవాహంతో పరవళ్లు తొక్కింది. పేదల పట్టాభిషేకం చూసి వెంకటపాలెంలో కొలువైన కలియుగ ప్రత్యక్ష దైవం ఏడుకొండలు వాడే పరవశించాడో ఏమో.. అమరావతి శుక్రవారం పేదింట మహాలక్ష్ముల సందడితో సంబరమై మురిసింది. ఆడపడుచుల కరతాళ ధ్వనులతో మంగళాద్రి లక్ష్మీనరసింహుడూ స్వరం కలిపి గర్జించాడో ఏమో.. బహుజన ఢంకా జయజయధ్వానాలు చేసింది. నలుదిక్కులూ ఏకమై కదిలివచ్చాయో ఏమో.. జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శాసన రాజధాని జయహో.. జయహో అంటూ జేజేలు పలికింది.



'పట్టా'భిషేకం : ఆడపడుచుకు పట్టా అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రంలో మంత్రులు వనిత, విడదల రజిని, సురేష్ ఎమ్మెల్యే ఆర్కే తదితరులు

జయహోం

- జగన్నినాదంతో మార్మోగిన శాసన రాజధాని
- అట్టహాసంగా పట్టాల పండగ
- ఇది కదా నిజమైన పసుపు కుంకుమ
- అమరావతిలో ఆడపడుచుల ఆనందోత్సాహాలు
- జూలై 8న ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన

సాక్షి ప్రతినిధి, గుంటూరు, తాడికొండ: తుళ్లూరు మండలం వెంకటపాలెంలో శుక్రవారం నిర్వహించిన పట్టాల పంపిణీ కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఎదురుగా ఏర్పాటు చేసిన బహిరంగ సభా ప్రాంగణం ఆడపడుచులతో కళకళలాడింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు హాజరైన కార్యకర్తలు, నాయకులు, అక్కచెల్లెళ్లకు అభివాదం చేశారు. రూ.పది లక్షల విలువైన ఆస్తిని అన్న తరఫు లాంఛనంగా అట్టహాసంగా అందించారు. ఇది కదా పసుపుకుంకుమ అంటూ ఆడపడుచులు సంబరమై మురిసిపోయారు.

పట్టాల మహోత్సవం సాగిందిలా..

10:10 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకున్న సీఎంకు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పేదలకు పంపిణీ చేసే లేఅవుట్ల గ్యాలరీని తిలకించిన ముఖ్యమంత్రి లబ్ధిదారులైన మహిళలతో కాసేపు ముచ్చటించారు. వారితో ఫొటో దిగారు. 10:29 గంటలకు వేదికపైకి చేరుకున్న ఆయన ప్రజలకు అభివాదం చేసిన అనంతరం ప్రజాప్రతినిధులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గుంటూరు కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి స్వాగతోపన్యాసం చేశారు. 10:41 గంటలకు మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కే ప్రసంగించారు. 10:48 గంటలకు మంత్రి ఆదిమూలపు సురేష్, 10:56 గంటలకు మంత్రి మేరుగ నాగార్జున, 11:01 గంటలకు మంత్రి జోగి రమేష్ ప్రసంగించారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగించారు. సీఎం గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి ఉన్న తేడాలు, పేదలకు జరిగిన లబ్ధిని వివరిస్తున్న సమయంలో హర్షధ్వానాలతో సభా ప్రాంగణం దద్దరిల్లింది. జూలై 8న మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి రోజున రాజధానిలో ఇచ్చిన ప్లాట్లలో అన్ని సౌకర్యాలతో లబ్ధిదారులకు ఇళ్ళ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని ప్రజల కరతాళధ్వనుల మధ్య ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సగర్వంగా ప్రకటించారు. 12:04 గంటలకు ముఖ్యమంత్రి 50,793 మంది ఆడపడుచులకు ఇళ్ళస్థల పట్టాల పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. వీటితో పాటు రూ.443.71 కోట్లతో నిర్మించిన 5,024 టిడ్కో ఇళ్లను కూడా లబ్ధిదారులకు సీఎం అందజేశారు. 1,400 ఎకరాల్లో వేసిన 25 లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణంతోపాటు అన్ని వసతులూ కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రతిలేఅవుట్‌లో అంగన్‌వాడీ కేంద్రం, ప్రైమరీ స్కూల్, విలేజ్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీ, పార్కులు ఏర్పాటు చేస్తామని, నవులూరులోని చెరువునూ అభివృద్ధి చేస్తామని ప్రకటించారు.



పేదింటి వరాల రేడు : లేఅవుట్ల గురించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యే ఆర్కే

నేడు నవులూరు, కృష్ణాయపాలెంలో పట్టాల పంపిణీ

శనివారం ఉదయం నవులూరు గ్రామంలోని 500 మంది లబ్ధిదారులకు పట్టాల పంపిణీ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంలో మంగళగిరి ఎమ్మెల్యేతోపాటు ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. సాయంత్రం కృష్ణాయపాలెంలో కృష్ణాయపాలెం, పెనుమాక లబ్ధిదారులకు పట్టాల పంపిణీ జరగనున్నట్లు జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు.

కిక్కిరిసిన సభా ప్రాంగణం

పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఎండను సైతం లెక్కచేయకుండా లబ్ధిదారులతోపాటు ప్రజలు భారీగా తరలిరావడంతో సభాప్రాంగణంతోపాటు పరిసరాలు జనంతో కిక్కిరిసిపోయాయి. అధికారులు ప్రజలకు తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు, స్నాక్స్ అందజేశారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు.



పట్టాల మహోత్సవానికి సకుటుంబ సమేతంగా..

పాల్గొన్న ప్రజాప్రతినిధులు

కార్యక్రమంలో మంత్రులు ఆదిమూలపు సురేష్, విడదల రజని, మేరుగ నాగార్జున, అంబటి రాంబాబు, కారుమూరి నాగేశ్వరరావు, తానేటి వనిత, ఎంపీలు నందిగం సురేష్, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురామ్, కల్పలతరెడ్డి, రుహుల్లా, ఎమ్మెల్యేలు ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), కిలారి రోశయ్య, అన్నాబత్తుని శివకుమార్, నంబూరు శంకరరావు, మహ్మద్ ముస్తాఫా, వెల్లంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, మొండితోక జగన్మోహనరావు, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడు, పార్టీ నాయకులు డొక్కా మాణిక్యవరప్రసాద్, కత్తెర సురేష్‌కుమార్, దేవినేని అవినాష్, గంజి చిరంజీవి, షేక్ సజిలా డీసీసీబీ చైర్మన్ లాలుపురం రాము, కలెక్టర్లు ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఢిల్లీరావు, సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్‌యాదవ్, ప్రిన్సిపల్ సెక్రటరీలు శ్రీలక్ష్మి, అజయ్‌జైన్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు రుణపడి ఉంటా



నా జీవితంలో ఇళ్ల స్థలం, అందులో సొంతింటి నిర్మాణం కలగానే మిగిలిపోతుందేమో అనుకునేదాన్ని. కానీ ఆ కలను జగనన్న నిజం చేశారు. ఎప్పుడో ఇంటి స్థలం మంజూరైంది. చంద్రబాబు కోర్టుల్లో కేసు వేయడంతో బాధగా ఉండేది. కోర్టు అడ్డంకులన్నీ తొలగించి జగనన్న మాకు ఇంటి స్థలం ఇచ్చారు. ఆయనకు రుణపడి ఉంటాం.

– ముక్కంటి శ్రీ దుర్గ, విజయవాడ

ఇంటి స్థలం వస్తుందని అనుకోలేదు



ఇంటి స్థలం అంటే ఏదో మారుమూల ప్రాంతంలో ఇస్తారేమో అనుకున్నాను. రాజధాని ప్రాంతమైన ఇంత మంచి ఏరియాలో నాకు ఇంటి స్థలం మంజూరవుతుందని ఊహించలేదు. నా లాంటి పేదలకూ ఈ ప్రాంతంలో చోటు కల్పించిన జగనన్న మరో 50 ఏళ్ళు ముఖ్యమంత్రిగా ఉండాలి.

– పరిమళ దుర్గ, మంగళగిరి

కల నెరవేరింది



ఇంటి స్థలం, సొంతింటి నిర్మాణం కల ఇన్నాళ్లకు సాకారం కాబోతోంది. మా ఆర్థిక స్థోమత అంతంత మాత్రమే. జగనన్న అధికారంలోకి వచ్చిన వెంటనే మమ్మల్ని గుర్తించి ఇళ్లస్థల పట్టాలివ్వడం ఆనందంగా ఉంది. ఆయన రుణం తీర్చుకోలేం.

– జంగం సామ్రాజ్యం, మంగళగిరి

జగనన్న మా దైవం



ఓ వైపు పెరుగుతున్న అద్దెలు చెల్లించలేక, మరో వైపు ఆర్థిక ఇబ్బందులతో ఇంటి స్థలం కొనలేక నానా అవస్థలు పడ్డాం. ఇదిగో మాకు జగనన్న రూపంలో ఇలా ఇంటి స్థలం మంజూరైంది. ఆయనే మా దైవం. త్వరలో ఇల్లు నిర్మించుకుని హాయిగా జీవిస్తాం.

– కొణిదెల భాగ్యలక్ష్మి, తాడేపల్లి

జగనన్న మేలు మరువలేం



గతంలో ఇంటి స్థలం లేక, కొనుక్కునే ఆర్థిక స్థోమత లేక అత్త మామయ్యలు, ముగ్గురు కుమారులు మొత్తం 4 కుటుంబాలు ఒకే చోట ఉండాల్సిన పరిస్థితి ఉండేది. జగనన్న నాకు, మా తోడికోడలుకు ఇంటి స్థలం మంజూరు చేశారు. త్వరలో అందులో సొంతింటిని నిర్మించుకుంటాం. చాలా ఆనందంగా ఉంది. జగనన్న మేలు మరువలేం.

– పఠాన్ అస్మిత, మంగళగిరి

ఇది గొప్ప సంకల్పం

కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్రంలో సొంత ఇల్లు లేని పేదలు ఉండకూడదు అన్న గొప్ప సంకల్పంతో నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం చేపట్టిందని గుంటూరు కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం వెంకటపాలెంలో జరిగిన పట్టాల పంపిణీ కార్యక్రమంలో స్వాగతోపన్యాసం చేసిన ఆయన గుంటూరు జిల్లాలో ఇప్పటికే లక్షా 17,108 మందికి ఇళ్ల పట్టాలు అందచేసినట్టు వివరించారు. దీనికోసం 276 ఎకరాల ప్రభుత్వ భూమితోపాటు రూ.1,452 కోట్ల రూపాయలు వెచ్చించి 2,512 ఎకరాల ప్రైవేటు భూములను సేకరించామని వెల్లడించారు. మొత్తం 2,789 ఎకరాలలో 284 జగనన్న కాలనీలు నిర్మిస్తున్నామని, ఆ భూములు చదునుచేసి సరిహద్దురాళ్లు, గ్రావెల్ రోడ్ల కోసం 81.56 కోట్ల రూపాయలు, తాగు నీరు, విద్యుత్ సరఫరా కోసం రూ. 47.57 కోట్లు కేటాయించామని పేర్కొన్నారు. మొదటి దశలో 209 కాలనీలలో 66,125 ఇళ్ల ప్రారంభమై వేగవంతంగా జరుగుతున్నాయని, జిల్లాలో 18,448 టిడ్కో ఇళ్ల నిర్మాణం దాదాపుగా పూర్తయిందని వివరించారు. మంగళగిరి, తెనాలి, పొన్నూరులో అన్ని మౌలిక వసతులతో ప్రారంభోత్సవాలు కూడా చేశామని, అమరావతిలో ఈరోజు ముఖ్యమంత్రి చేతుల మీదుగా సీఆర్డీఏ పరిధిలోని పది గ్రామాలలో 5,024 ఇళ్ల ప్రారంభోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. ఈరోజు 23,762 మంది లబ్ధిదారులకు 10 లేఅవుట్లలో 1402.58 ఎకరాల భూమిలో పట్టాలు ఇస్తున్నామని వివరించారు.

మహంకాళీ అమ్మవారి గుడికి రూ.లక్ష విరాళం



తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరులో వేంచేసిన మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి శుక్రవారం దాతలు రూ.1,00,116 విరాళం అందజేశారు. విజయవాడ వాస్తవ్యులు చిలుకూరి క్రాంతి కిరణ్ గుహన్ దంపతులు ఆలయ అభివృద్ధి నిమిత్తం ఈ మొత్తం అందజేశారని ఆలయ కార్యనిర్వహణాధికారి వెంకటరెడ్డి తెలిపారు. అనంతరం గుహన్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారని, వారికి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించామని వివరించారు.

నేడు నర్సింగ్ ట్యూటర్స్ ప్రమోషన్ కౌన్సెలింగ్

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో బీఎస్సీ నర్సింగ్ అర్హత కలిగి ప్రభుత్వ సర్వీసులో నర్సుగా విధులు నిర్వహిస్తున్న వారికి ట్యూటర్‌గా పదోన్నతి కౌన్సెలింగ్ శనివారం నిర్వహించనున్నారు. ఈ మేరకు గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. మూడు జిల్లాల్లో 27 మంది నర్సింగ్ అభ్యర్థుల్ని శనివారం ఉదయం 11 గంటలకు గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆర్డీ కార్యాలయంలో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలంటూ ఆదేశాలు జారీ చేశారు.

ఉపాధ్యాయ బదిలీలకు దరఖాస్తుల వెల్లువ

గుంటూరు ఎడ్యుకేషన్: బదిలీలు కోరుతూ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులతో పాటు వివిధ కేటగిరీలకు చెందిన 6,046 మంది ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు దాఖలు చేశారు. లాంగ్ స్టాండింగ్ విభాగంలో తప్పనిసరి బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లాల్సిన హెచ్ఎంలతో పాటు రిక్వెస్ట్ బదిలీపై వెళ్లేందుకు ఎదురు చూస్తున్న ఆశావహులు పెద్దసంఖ్యలో ఉన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 11,805 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఇందులో బదిలీకి దరఖాస్తు చేసిన 6,046 మందిలో లాంగ్ స్టాండింగ్ విభాగంలో 1,947 మందికి స్థానచలనం కలగనుంది. రిక్వెస్ట్ బదిలీ కోరుతూ మరో 4,099 మంది దరఖాస్తు చేశారు. సాధారణ బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఉమ్మడి జిల్లా పరిధిలోని ఉపాధ్యాయుల నుంచి మూడు రోజుల పాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల్ని స్వీకరించిన విద్యాశాఖ.. ప్రింటవుట్ కాపీల్ని ఎంఈవో, డీవైఈవోల ద్వారా సేకరించింది.

పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ఉపాధ్యాయులు

ఎస్జీటీ కేడర్ ఉపాధ్యాయుల నుంచి ఎంఈవోలు, స్కూల్ అసిస్టెంట్, హెచ్ఎం కేడర్‌కు చెందిన వారి నుంచి డీవైఈవోలు దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తుల దాఖలుకు చివరి రోజైన శుక్రవారం ఉపాధ్యాయులు ఎంఈవో, డీవైఈవోతో పాటు గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల వరకు విద్యాశాఖ ఆన్‌లైన్‌లో దరఖాస్తుల్ని స్వీకరించింది. ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దాఖలు చేసిన బదిలీ దరఖాస్తుల్ని గుంటూరులోని కార్యాలయంలో డీఈవో పి.శైలజ, గుంటూరు డీవైఈవో కె. సుధాకర్‌రెడ్డి క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి వరకు దాఖలైన దరఖాస్తుల ప్రింటవుట్ కాపీల్ని సంబంధిత హెచ్ఎంలు, ఉపాధ్యాయులు శనివారం కార్యాలయంలో ఎట్టి పరిస్థితుల్లో అందజేయాల్సి ఉందని డీఈవో పి.శైలజ ఆదేశించారు. ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ కానున్న 597 పోస్టులు ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ ముగిసిన వెంటనే ఉద్యోగోన్నతుల ప్రక్రియ ప్రారంభం కానుంది. బదిలీలతో ఏర్పడే ఖాళీల్ని కలుపుకుని ప్రభుత్వ పాఠశాలల్లో 597 పోస్టులను ఉద్యోగోన్నతులతో భర్తీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విధంగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 42 హెచ్ఎం పోస్టులతో పాటు జీవశాస్త్రం-115, గణితం-103, ఇంగ్లిష్-236, సాంఘిక శాస్త్రం-60, భౌతికశాస్త్రంలో 41 పోస్టులను ఉద్యోగోన్నతి ద్వారా భర్తీ చేయనున్నారు.



బదిలీ దరఖాస్తులు సమర్పించేందుకు డీఈవో కార్యాలయానికి వచ్చిన ఉపాధ్యాయులు

నేడు 6 జిల్లాల్లో 'నిధి ఆప్‌కే నికత్'

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు కృష్ణనగర్‌లోని ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) ఆధ్వర్యంలో శనివారం (మే 27న) పీఎఫ్ పరిధిలోకి వచ్చే యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లు, ఇతర వాటాదారులు, లబ్ధిదారులతో నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ శుక్రవారం తెలిపారు. ఈపీఎఫ్ యాక్ట్‌లో పథకాలు, సేవలపై వాటాదారులకు అవగాహన కల్పించేందుకు కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఒంగోలులో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సమావేశాలు నిర్వహిస్తామని వివరించారు. తాడేపల్లిలోని కుంచనపల్లి అరవింద ఉన్నత పాఠశాల, కృష్ణా జిల్లా పామర్రులోని సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్స్, ఒంగోలులో కర్నూలు రోడ్డులోని శ్రీశారదానికేతన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, జగ్గయ్యపేట జయంతిపురంలోని రామ్‌కో సిమెంట్స్, బాపట్ల జిల్లా ఇంకొల్లులోని ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్, సత్తెనపల్లిలోని ఎస్వీఆర్ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్లో ఈ సమావేశాలు జరగనున్నాయని వివరించారు.

రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా ఈశ్వరరావు



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా కె.ఈశ్వరరావు శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈనెల 19న జరిగిన బదిలీల్లో ఆయనను గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా బదిలీ చేసిన విషయం తెలిసిందే.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా ప్రభావతి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ నీలం ప్రభావతిని కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల ప్రభావతిని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ చేసిన విషయం తెలిసిందే. అయితే జూన్ 30న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో తనను సూపరింటెండెంట్‌గానే కొనసాగించాలన్న ఆమె కోరిక మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

కడతేర్చి'నది'

- ప్రాణం తీసిన ఈత సరదా
- ఇద్దరి దుర్మరణం
- రెండు కుటుంబాల్లో తీరని విషాదం
- విలపించిన తల్లిదండ్రులు



మరణించిన కృష్ణయ్య, శివశంకర్ (ఫైల్)

తాడేపల్లిరూరల్ : సరదాగా స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన ఆ ఇద్దరు కృష్ణమ్మ ఒడిలో ఎగిరెగిరి పడుతూ చేస్తున్న అల్లరిని చూసి మృత్యువుకు కన్ను కుట్టిందో ఏమో నీళ్ల రూపంలో చుట్టుముట్టి కబళించింది. తుళ్లింతలు, కేరింతలు అంతలోనే ఆర్తనాదాలయ్యాయి. పేద తల్లిదండ్రులకు పుత్రశోకం మిగిలింది. ఈ హృదయ విదారక ఘటన శుక్రవారం తాడేపల్లి కృష్ణానది దిగువ పుష్కరఘాట్ల సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద జరిగింది. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. తాడేపల్లి డోలాస్ నగర్‌కు చెందిన దేరంగుల లక్ష్మయ్య, జ్యోతి ఏకైక కుమారుడైన దేరంగుల శివశంకర్(18) మంగళగిరిలోని ఓ వస్త్ర దుకాణంలో పని చేస్తున్నాడు. వీరి బంధువైన దేరంగుల నరసింహారావు, వరలక్ష్మిల పెద్ద కుమారుడు దేరంగుల కృష్ణయ్య (17) ఇంటర్ చదివి ఖాళీగా ఉంటున్నాడు. వీరిద్దరూ శుక్రవారం మధ్యాహ్నం స్నేహితులు పల్లపు అజయ్‌కుమార్, వీర్ల దినకర్, పల్లపు దేవయ్య, కుంచాల లక్ష్మయ్యతో కలిసి కృష్ణానది దిగువ ప్రాంతంలో రైల్వే బ్రిడ్జి కింద నీటిలోకి ఈతకు దిగారు. కేరింతలు కొడుతూ జలకాలాడారు. ఈ సమయంలో ఒక్కసారిగా శివశంకర్ నీటిలో మునిగిపోతుండడంతో రక్షించేందుకు కృష్ణయ్య యత్నించాడు. కానీ ఫలితం లేకపోయింది. ఇద్దరూ నీటిలో మునిగి గల్లంతయ్యారు. మిగిలిన స్నేహితులు కేకలు వేయడంతో సమీపంలో చేపలు పడుతున్న మత్స్యకారులు నీటిలో దూకి రక్షించేందుకు యత్నించినా ఉపయోగం లేకపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. గంట అనంతరం ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. చేతికందివచ్చిన కొడుకులు చనిపోవడంతో పేద తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు. గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఎస్ఐ వినోద్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో నవ వరుడు మృతి

- వధువుకు తీవ్ర గాయాలు
- పెళ్లి అనంతరం శ్రీశైలం బయలుదేరుతుండగా దుర్ఘటన
- మరో యువకుడికి తీవ్ర గాయాలు



మృతిచెందిన అవ్వారు సాయి కుమార్



గాయపడిన ఉమాలక్ష్మి



అపస్మారక స్థితిలో ఉన్న ఆళ్ల వెంకటేష్

చేబ్రోలు: కోటి ఆశలతో ఒక్కటైన ఆ జంట ఆనందం అంతలోనే ఆవిరైంది. రోడ్డు ప్రమాదం వరుడిని బలి తీసుకుంది. కాళ్లపారాణి ఆరక ముందే వధువు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలైంది. మరోవ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ దుర్ఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామశివారులో గురువారం రాత్రి జరిగింది. తెనాలి పట్టణం శాలీపేటకు చెందిన అవ్వారు సాయి కుమార్ (26) జ్యూయలరీ షాపులో పనిచేస్తున్నాడు. ఇదే ప్రాంతానికి చెందిన పి.ఉమా లక్ష్మిని ప్రేమించాడు. ఇద్దరూ గురువారం విజయవాడలోని ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. వీరి వివాహాన్ని ఇరు కుటుంబాలకు చెందిన పెద్దలు అంగీకరించలేదు. పెళ్లి అనంతరం నవ దంపతులు శ్రీశైలం గుడికి వెళ్లి మొక్కు తీర్చుకోవాలని భావించారు. గుంటూరు నుంచి 12 గంటల బస్సుకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. దీనికోసం గుంటూరుకు ద్విచక్ర వాహనంపై గురువారం రాత్రి సమయంలో తెనాలి నుంచి బయలు దేరారు. మార్గ మధ్యలో చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న మరో బైక్ ప్రమాదవశాత్తూ ఢీకొంది. ఈ ఘటనలో నవదంపతులతోపాటు మరో బైక్‌పై ఉన్న చేబ్రోలు ఉప్పరపాలెంకు చెందిన ఆళ్ల వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు ముగ్గురినీ 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అవ్వారు సాయి కుమార్ మృతి చెందాడు. ఉమా లక్ష్మి ముఖానికి, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఉప్పరపాలెంకు చెందిన ఆళ్ల వెంకటేష్ తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్నాడు. అతని పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదంలో రెండు బైక్‌లు పూర్తిగా దెబ్బతిన్నాయి. చేబ్రోలు ఎస్ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మంత్రి విడదల రజిని


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి నాగార్జున


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి సురేష్


ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆహ్వానం పలుకుతున్నఎంపీ నందిగం సురేష్


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్నకలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

టిడ్కో ఇళ్ల పేరుతో చంద్రబాబు దగా

- సీఆర్డీఏ పరిధిలో 50 వేలకు పైగా సీఎం జగన్ ఇళ్లపట్టాలిచ్చారు
- 5,024 టిడ్కో ఇళ్లను కూడా అందించారు
- ఈ ఇళ్లపై ప్రభుత్వం మరో రూ.251 కోట్లు ఖర్చు చేసింది
- ప్రజలు బాబు నైజాన్ని గ్రహించారు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయెల్

సాక్షి, అమరావతి: టిడ్కో ఇళ్ల పేరుతో చంద్రబాబు ప్రజలను దగా చేశారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయెల్ ధ్వజమెత్తారు. సీఎం వైఎస్ జగన్ సీఆర్డీఏ పరిధిలో 50,793 మంది పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వడంతోపాటు 5,024 టిడ్కో ఇళ్లను కూడా లబ్ధిదారులకు అందించారని కొనియాడారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో శుక్రవారం బొమ్మి ఇజ్రాయెల్ మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు టిడ్కో ఇళ్ల బండారాన్ని సీఎం జగన్ కళ్లకు కట్టినట్లు ప్రజలకు తెలియజేశారన్నారు. దీంతో చంద్రబాబు అసలు నైజం ప్రజలకు అర్థమైందన్నారు. చంద్రబాబు హయాంలో 300 చ.అ. ఫ్లాటు కట్టడానికి అయిన వ్యయం అడుగుకి రూ.2 వేలు అనుకుంటే దాదాపుగా రూ.5.75 లక్షలు అవుతుందని తెలిపారు. మౌలిక సదుపాయాల కోసం మరో రూ.1 లక్ష అవుతుందని చెప్పారు. రూ.6.75 లక్షలు ఖర్చయ్యే ఫ్లాట్‌లో.. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ రూపంలో రూ.లక్షన్నర, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్షన్నర ఇస్తుందన్నారు. మిగిలిన రూ.3 లక్షలను పేదలు బ్యాంకుల నుంచి అప్పుగా తీసుకుని 20 ఏళ్లపాటు ప్రతి నెలా రూ.3 వేలు చొప్పున కట్టుకుంటూ పోవాలన్నారు. 20 ఏళ్లలో ఈ అప్పు వడ్డీతో కలిసి తడిసి మోపెడై ఒక్కో లబ్ధిదారు మొత్తం రూ.7.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ వాస్తవాలను సీఎం జగన్ పట్టాల పంపిణీ సభలో ప్రజలకు తెలియజేశారన్నారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణ విలువ రూ.443 కోట్లు

సీఎం జగన్ లబ్ధిదారులకు అందించిన టిడ్కో ఇళ్ల నిర్మాణ విలువ రూ.443 కోట్లు అని బొమ్మి ఇజ్రాయెల్ తెలిపారు. వారంలో గృహప్రవేశాలు చేయించి, వారికి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు కూడా ప్రభుత్వం అందిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ రూపేణా ఒక్కో ఫ్లాట్‌పై రూ.1.50 లక్షలు చొప్పున ఇచ్చింది రూ.75 కోట్లు మాత్రమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ 5,024 ఫ్లాట్ల మీద మరో రూ.251 కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు. టిడ్కో ఇళ్ల గురించి పేదలతో పాటు ప్రజలందరూ వాస్తవాలు తెలుసుకోవాలని కోరారు. చంద్రబాబు మోసం, దగాను ఎండకట్టాలని పిలుపునిచ్చారు.

‘పట్టా’లేనంత ఆనందం!

పేదవాడికి సొంతింటికల అందని ద్రాక్ష. దాన్ని అందిన ద్రాక్షగా చేసి వారికి గృహయోగాన్ని కల్పిస్తున్నారు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి. తుళ్లూరు మండలం వెంకటపాలెం గ్రామంలో శుక్రవారం జరిగిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాజరైన పలువురు మహిళలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై, జగనన్న సుపరిపాలనపై తమ ఆనందాన్ని ఇలా వ్యక్తం చేశారు. –సాక్షి నెట్‌వర్క్

జగనన్న పాలనలో బతుకులు మారాయి



జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాతే పేదల బతుకుల్లో మార్పు వచ్చింది. హీనస్థితి నుంచి ఉన్నత స్థితికి చేర్చారు. అలాంటి నాయకుడిని కొంతమంది నోటికి వచ్చినట్లు మాట్లాడటం చాలా బాధగా ఉంది. గతంలో పేదలకు అరసెంటు భూమి కూడా ఇవ్వని వారు ఇప్పుడు వారి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. తిరిగి మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి అవుతారు. ఎన్ని పార్టీలు కలిసొచ్చినా బాబుకు ఓటమి తప్పదు.

– పసుపులేటి దుర్గా భవాని, విజయవాడ

పరిపాలనలోనే విప్లవాత్మక మార్పులు



జగనన్న ముఖ్యమంత్రి అవగానే పాత పరిపాలనకు స్వస్తి పలికి కొత్త విధానాన్ని తీసుకొచ్చారు. గతంలో ఏ సంక్షేమ పథకం కావాలన్నా నాయకులు, అధికారంలో ఉన్న పార్టీల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు వలంటీర్లను పెట్టి ఇంటికే అన్ని అందజేస్తున్నారు. ఈ సభకు వచ్చిన అందరూ వలంటీర్ల ద్వారా గుర్తించి ఇళ్ల స్థలాలు వచ్చేలా చేశారు. మళ్లీ తిరిగి జగనన్నే ముఖ్యమంత్రి అవ్వాలి

– వెంకటేశ్వరరావు, కురగల్లు

ఇలాంటి సీఎంని చూడలేదు



ఇప్పటి వరకు పరిపాలించిన ముఖ్యమంత్రుల్లో ఇలాంటి ముఖ్యమంత్రిని ఎప్పుడూ చూడలేదు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేదల సంక్షేమం కోసమే పనిచేస్తున్నారు. ఎక్కడి నుంచో వలస వచ్చి చిన్న గదిలో అద్దెకుండే మాలాంటి వారికోసం సెంటు భూమిని కేటాయించారు. వాటిలో ఇంటిని నిర్మించుకునేందుకు కొంత ఆర్థిక సాయం చేస్తామంటున్నారు. విమర్శిస్తున్న నాయకులకు సమాధి కట్టుకునేందుకు ఎకరాల ఎకరాలు భూమి కావాలేమో. మాకు నివాసం ఉండేందుకు సెంటు భూమి చాలు. మా ఇళ్లకు వచ్చి చూస్తే మా పరిస్థితి ఏంటో అర్థమవుతుంది. జగనన్న పుణ్యమా అంటూ మాకు ఇళ్లు లభించాయి.

– సీరజ, విజయవాడ

జగనన్నతోనే విద్యార్థుల భవిష్యత్



జగనన్నే విద్యార్థులకు భవిష్యత్. విద్యార్థుల కోసం పాఠశాలల్లో ఎన్నో మార్పులు తీసుకొచ్చారు. మేం చదువుకునే సమయంలో ప్రభుత్వ పాఠశాలలు ఇప్పుడున్నట్లు లేవు. జగనన్న పరిపాలనలో కూలీ పనులు చేసుకునే మాకు సొంతింటి స్థలం తీసుకొని ఇల్లు నిర్మించుకునే అవకాశం దక్కింది. మా అమ్మ, నాన్న నా చిన్నప్పటి నుంచి వచ్చిన ప్రతి నాయకుడినీ అడుగుతూనే ఉండేవారు. కానీ జగనన్న ద్వారా నాయకులతో సంబంధం లేకుండా కేవలం వలంటీర్ ద్వారా ఇంటి స్థలం అందించారు. ఇలాంటి నాయకుడు ఉంటే మావంటి పేదలకు ఎలాంటి ధోకా ఉండదు.

– జ్యోతి, నర్సింగ్ విద్యార్థిని, విజయవాడ



తుళ్లూరు మండలం వెంకటపాలెంలో ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, తాడికొండ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ దంపతులు

–తాడికొండ

ప్రత్యేక రైళ్ల కేటాయింపు

లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం సికింద్రాబాద్‌-కటక్ వయా గుంటూరు డివిజన్ మీదుగా ప్రత్యేక రైళ్లను కేటాయించినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ శుక్రవారం వెల్లడించారు. సికింద్రాబాద్‌-కటక్ వయా గుంటూరు డివిజన్ మీదుగా జూన్ 6, 13, 20, 27 తేదీల్లో నంబర్‌- 07165 రైలును కేటాయించినట్లు తెలిపారు. కటక్‌-సికింద్రాబాద్ వయా గుంటూరు డివిజన్ మీదుగా జూన్ 7, 14, 21, 28వ తేదీల్లో రైలు నంబర్ -07166ను కేటాయించినట్లు ఆయన తెలిపారు.



వెంకటపాలెం జనసందోహమైంది. పెద్ద ఎత్తున ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడంతో గుంటూరు-ఎన్టీఆర్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు తరలి వచ్చారు. వృద్ధులు, పిల్లలు భారీగా తరలిరావడం కనిపించింది. వీరందరి రాకతో ఈ ప్రాంతం పండుగను తలపించింది.

-సాక్షి ఫొటోగ్రాఫర్



మూడు కిలో మీటర్ల మేర స్వాగత బ్యానర్లు, తోరణాలు

తాడికొండ: రాజధానిలో పేదల ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమానికి విచ్చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి స్వాగతం పలుకుతూ రహదారి పొడవునా వెంకటపాలెంలోని వేదిక వరకు 3 కిలోమీటర్ల మేర స్వాగత బ్యానర్లు, తోరణాలను ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, ఎంపీ నందిగం సురేష్‌లు ఏర్పాటు చేసిన ఈ తోరణాలు, బ్యానర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

గుంటూరు టీడీపీలో వర్గపోరు

- తూర్పు టికెట్‌కు పెరుగుతున్న ఆశావహులు
- ఎవరికి వారే సొంతంగా కార్యక్రమాలు
- నాయకుల మధ్య భగ్గుమంటున్న విభేదాలు
- దిశ నిర్దేశం కొరవడిందంటున్న కార్యకర్తలు


పార్టీ కార్యాలయంలో దేగల ప్రభాకర్ ఫొటో లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

పాత గుంటూరు: గుంటూరు తూర్పు నియోజకవర్గ టీడీపీలో ముసలం బయలుదేరింది. నాయకుల మధ్య వర్గ విబేధాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తూర్పు టీడీపీలో ఆశావహులు పెరుగుతున్నారు. నాయకులు ఎవరికి వారే తమకే టికెట్ సొంతం అన్న భావనతో సొంత ఎజెండాతో కార్యక్రమాలు నిర్వహిస్తూ అధినేత మెప్పు పొందే విధంగా ముందుకు సాగుతున్నారు. సొంత నిర్ణయాలతో పార్టీ కార్యాలయాల ఏర్పాటుతో పాటు, ప్రైవేటు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో నాయకుల మధ్య విబేధాలు పెరుగుతుండటంతో కార్యకర్తలు విస్మయానికి గురవుతున్నారు. రాష్ట్ర నాయకత్వం అవలంబిస్తున్న ద్వంద వైఖరితోనే తూర్పు నియోజకవర్గంలో ఈ పరిస్థితి నెలకొందని కార్యకర్తలు బాహాటంగా చెబుతున్నారు. నాయకత్వ లోపం కారణంగానే సక్రమంగా నిర్వహించాల్సిన పార్టీ కార్యక్రమాలపై దిశానిర్దేశం కొరవడిందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

శుక్రవారం అరండల్‌పేటలోని టీడీపీ కార్యాలయంలో తూర్పు నియోజకవర్గ వర్గ మినీ మహానాడు జరిగింది. తూర్పు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ నసీర్ అహ్మద్ తీరుపై పార్టీ నగర అధ్యక్షులు దేగల ప్రభాకర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నగర అధ్యక్షుడినైన తనకి బ్యానర్లలో ఫొటో వేసి తనకు ప్రాధాన్యత కల్పించడం లేదని దేగల కన్నెర్ర చేసినట్లు తెలిసింది. పార్టీ అందరిదని స్వార్థంతో పనిచేయకూడదని దేగల ప్రభాకర్ నసీర్‌కు సూచించినట్లు సమాచారం. గతంలో దేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన వన సమారాధనలో నసీర్‌కు ఆహ్వానం లేకపోవడంతో ఆ విషయం చర్చనీయాంశంగా మారింది.

గ్రానైట్ కార్మికుడి అనుమానాస్పద మృతి

సంతమాగులూరు (అద్దంకి రూరల్): గ్రానైట్ క్వారీలో పనిచేస్తున్న కార్మికుడు అనుమానాస్పదంగా మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం సంతమాగులూరు మండలంలో చోటుచేసుకుంది. మృతుడి సోదరుడు బాబువలి ఫిర్యాదు మేరకు ఎస్సై శివకుమార్ కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. అసోం రాష్ట్రం బంగంగోయి జిల్లా బిద్యపురు గ్రామానికి చెందిన అబుల్‌ఆలీ (25) సంతమాగులూరు మండలంలోని పుట్టావారిపాలెం జంక్షన్ వద్దనున్న ఏ-1 గ్రానైట్ ఫ్యాక్టరీలో ఆరు నెలలనుంచి స్టోన్ కటింగ్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి అబుల్ ఆలీ గ్యాస్ట్రిక్ సమస్యతో బాధపడుతున్నట్లు సోదరుడికి చెప్పటంతో తగ్గేందుకు ఈనో ప్యాకెట్లు తెచ్చి ఇచ్చాడు. అక్కడే నివాసం ఉంటున్న భవనం మొదటి అంతస్తులో పడుకోబెట్టి వెళ్లిపోయాడు. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు స్నేహితుడు బాత్‌రూమ్‌కు వెళ్లి చూడగా అబుల్ ఆలీ రక్తపు గాయాలతో బాత్‌రూమ్‌లో నిల్చుని ఉన్నాడు. వెంటనే నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ ఉదయం 5.30 గంటలకు చనిపోయాడు.

నేడు టెన్త్ ప్రతిభావంతులకు మాస్టర్‌మైండ్స్ పురస్కారాలు

గుంటూరు ఎడ్యుకేషన్: బాపట్ల, వినుకొండ, చీరాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభావంతులుగా నిలిచిన విద్యార్థులకు శనివారం ప్రతిభా పురస్కారాలు బహూకరిస్తున్నట్లు మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి స్టేట్, ఐసీఎస్ఈ సిలబస్‌లలో 550కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు సీబీఎస్ఈ సిలబస్‌లో 450కి పైగా మార్కులను సాధించిన విద్యార్థులను సత్కరించి, వారికి నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. శనివారం సాయంత్రం 5.00 గంటలకు ఆయా పట్టణాల్లో జరిగే ప్రతిభా పురస్కార ప్రధాన కార్యక్రమాలకు హాజరు కాగోరు విద్యార్థులు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకుని, తమ తల్లిదండ్రులతో పాటు హాజరు కావాలని సూచించారు. విద్యార్థులు తమవెంట ఆధార్ కార్డు, టెన్త్ మార్కుల జాబితా ఇంటర్నెట్ కాపీ తీసుకుని రావాలని సూచించారు. విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల సర్టిఫికెట్‌తో పాటు జ్ఞాపిక, నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. బాపట్ల పట్టణానికి చెందిన విద్యార్థులు జీబీసీరోడ్డులోని పోతేరమ్మగుడి వద్ద ఉన్న అశోకా కన్వెన్షన్ హాల్ (91000 69428, 91212 10582), వినుకొండకు చెందిన విద్యార్థులు ఆంధ్రాబ్యాంక్ మొదటి అంతస్తులోని వీఎల్ఎస్ రెసిడెన్సీ (92487 22281, 88850 40515), చీరాల పట్టణ పరిధిలోని విద్యార్థులు పేరాల ఆంధ్రాబ్యాంక్‌రోడ్డులోని గోలి సదాశివరావు పద్మశాలీయ కళ్యాణ మండపంలో (92487 22218, 63032 93445) జరిగే కార్యక్రమాలకు హాజరు కావాలని సూచించారు.

ఉద్యోగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి, వీసీ

- ఉద్యోగుల వ్యవహారాల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి
- క్రీడా పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

ఏఎన్‌యూ: యూనివర్సిటీలో ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఉద్యోగుల వ్యవహారాల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎస్. చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అధ్యాపకేతర సిబ్బంది సంఘం (వికాస) ఆధ్వర్యంలో ఇటీవల ఉద్యోగులకు నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు శుక్రవారం బహుమతులు ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చంద్రశేఖర్‌రెడ్డి ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ ఉద్యోగుల పక్షమేనని స్పష్టం చేశారు. మరింత అంకితభావంతో విధులు నిర్వహించి యూనివర్సిటీకి, రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని సూచించారు. వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ప్రసంగిస్తూ యూనివర్సిటీ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర ముఖ్యమైనదన్నారు. విధి నిర్వహణతో పాటు క్రీడల్ని కూడా దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని తెలిపారు. ఒత్తిడిని అధికమించడానికి క్రీడలు దోహదం చేస్తాయని చెప్పారు. రెక్టార్ ఆచార్య పి. వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ ప్రసంగిస్తూ క్రీడా పోటీల్లో మహిళా ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఉద్యోగులు క్రీడల్లో చురుగ్గా పాల్గొనేందుకు కావాల్సిన అన్నిరకాల ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. వికాస అధ్యక్ష కార్యదర్శులు అనిల్ కుమార్, శ్రీనివాసరావు, సీఈ నరసారెడ్డి, ఏసీఈ ప్రకాశరావు, పలువురు ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.